క్లుప్తంగా

విద్యార్థులకు టై, బెల్టుల వితరణ



పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన దుంపల్లి శ్యాంసుందర్‌రెడ్డి టై, బెల్టులను వితరణగా మంగళవారం మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు చేతుల మీదుగా అందజేశారు. పాఠశాలల్లోని38 మంది విద్యార్థులకు రూ.3,400 విలువ గల టై, బెల్టులను వితరణగా అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దాతను పాఠశాల ఉపాధ్యాయ బృందం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్ యాదవ్, ఉపాధ్యాయురాలు మంజుల, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మదనాపురం: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మంగళవారం వార్డెన్ బెనహర్ ఆధ్వర్యంలో 43 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలు, పొలం గట్టున మొక్కలు పెంచుకోవాలని కోరారు. చెట్ల ద్వారానే మనిషి మనుగడ సాధ్యమవుతుందన్నారు.

పాఠశాల తనిఖీ



పెబ్బేరు రూరల్: మండలంలోని బునాదిపురం, సూగూరు ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ జయరాములు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన పాఠశాల రికార్డులు, తరగతిగదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో అభ్యాస దీపికలను నిరంతరం సాధన చేయించాలని, ప్రైమరీ స్థాయిలో విద్యార్థులకు గుణాత్మక అంశాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణ, నాగేషు, మల్లికార్జున్‌రెడ్డి, దయానంద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



గుమ్మడంలో కూలిన ఇల్లు

పెబ్బేరు రూరల్: మండలంలోని గుమ్మడంలో ఇటీవల కురిసిన వర్షాలకు మద్దెరి శారదమ్మకు చెందిన ఇంటి పైకప్పు మెత్తబడి మంగళవారం అకస్మాతుగా కూలిపోయింది. కూలిపోయే సమయంలో శారదమ్మ ఇంటి బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. ఇటీవల ఆమె భర్త చనిపోవడంతో తను కొడుకుతో కలిసి అదే ఇంట్లో జీవనం సాగిస్తుంది. ఉన్న ఇల్లు కూడా కూలిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని బాధితురాలు వాపోయారు. ప్రభుత్వం స్పందించి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

పంచాయతీ కార్మికురాలు మృతి

ఖిల్లాఘనపురం: ఖిల్లాఘనపురం గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న పానుగంటి నాగమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి పాండునాయక్, ఎంపీఓ రాజు, కార్యదర్శి రవితేజ ఆమె దహన సంస్కారాల నిమిత్తం గ్రామ పంచాయతీ తరఫున రూ.10 వేలు అందించారు. అదేవిధంగా మాజీ సర్పంచు క్యామ వెంకటరమణ రూ.20 వేల ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికురాలిగా నాగమ్మ గ్రామానికి పారిశుద్ధ్య పనుల్లో సేవలు అందించిందని గుర్తుచేసుకున్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా గోపాల్



ఆత్మకూర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ గోపాల్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్ బదిలీపై గద్వాలకు వెళ్లడంతో.. విద్యాశాఖ కమీషనరేట్ నుంచి గోపాల్‌ను అడిషనల్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తు ఉత్తర్వులు విడుదల చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను చేపట్టిన గోపాల్‌ను అధ్యాపకులు చక్రపాణిరెడ్డి, షకీల్‌అహ్మద్, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, గిరిధర్, విద్యార్థులు సత్కరించారు.

అమరవీరులను స్మరించుకుందాం



జగత్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం, స్వచ్ఛంద సంస్థ సభ్యులు

కొత్తకోట రూరల్: 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జగత్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. యువ సంయుక్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్దమందడి మండలం జగత్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా 6వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు, 9వ, 10వ తరగతి విద్యార్థులకు భారతీయ స్వాతంత్ర్య సమర యోధులపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులతో పాటు స్టడీ టేబుల్స్, స్కూల్ బ్యాగ్స్, పరీక్ష ప్యాడ్స్, పౌచులు, స్టేషనరీ వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ యువసంయుక్త అధ్యక్షుడు ఆవుల అక్షయ్‌కుమార్, వివేక్, జీహెచ్‌ఎం మల్లికార్జున్, ఉపాధ్యాయ బృందం, స్వచ్ఛంద సంస్థ సభ్యులు జిస్నా, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల వద్ద జెండాలు ఎగురవేయాలి

పాన్‌గల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో అమృత్ సరోవర్ చెరువుల వద్ద జాతీయ జెండాలను ఎగురవేసి, విరివిగా మొక్కలు నాటాలని ఎంపీడీఓ గోవింద్‌రావు, ఏపీఓ కుర్మయ్య అన్నారు. మంగళవారం మండలంలోని గోప్లాపూర్ అమృత్ సరోవర్ చెరువు పరిసరాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో గోప్లాపూర్, చింతకుంట, అన్నారం, దావాత్‌ఖాన్‌పల్లి గ్రామాల్లో అమృత్ సరోవర్ చెరువులు ఉన్నాయని, ఆయా చెరువుల పరిసరాల్లో జెండా ఎగురవేసేందుకు దిమ్మెలు, మొక్కలు నాటేలా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించినట్లు వారు పేర్కొన్నారు. దీంతో పాటు విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఈసీ అంజన్‌రెడ్డి, టీఏ సురేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలో మంగళవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి, హర్ ఘర్ తిరంగాతో ఏకమవుదాం అనే నినాదంతో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వంగూరు రామకృష్ణారెడ్డి, రేజింతల శ్రీనివాసులు, మాధవరెడ్డి, బిట్ల రాజశేఖర్, కొండ వెంకటేశ్వర్లశెట్టి, బంగారు రవి, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని పాతపల్లిలో బీజేపీ వనపర్తి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని నీటితో శుభ్రం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగరాజుయాదవ్, దేవేందర్‌నాయుడు, కిరణ్, శశిధర్, జగదీశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలో బస్టాండు వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహాన్ని బీజేవైఎం నాయకులు శుద్ధిచేసి పూలమాలలు వేశారు. అనంతరం జాతీయ జెండా పట్టుకుని కిరాణ షాపుల్లో తిరిగి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి తిరుపతిరెడ్డి, శ్రీశైలం, రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, నాగరాజు, అశోక్‌రెడ్డి, అరుణమ్మ, తిరుపతినాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ప్రధాన రోడ్లపై ఉన్న దుకాణాలతో పాటు ఇళ్ల వద్దకు బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ అధ్యక్షతన మంగళవారం ఉదయం నుంచి నాయకులు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, దశరథం, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆశన్న తదితరులు పాల్గొన్నారు.



మదనాపురంలో ర్యాలీ



గోపాల్‌పేట మండల కేంద్రంలో..



గోప్లాపూర్ శివారులో..

బాధితురాలికి ఆర్థికసాయం

ఆత్మకూర్: మండలంలోని పిన్నంచర్లకు చెందిన అజ్జపాగ మణెమ్మ మూత్రపిండాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటోంది. వైద్య ఖర్చులు కోసం బాధితురాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుందని గమనించిన గ్రామ యువకులు విషయాన్ని టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర గీత కార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన స్థానిక నాయకుల ద్వారా ఆర్థికసాయం పంపించగా.. యువకులు నగదును బాధితురాలికి అందించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు కృష్ణకాంత్, మన్మోహన్, కిరణ్‌కుమార్, వినోద్, అశోక్ తదితరులు ఉన్నారు.

పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

పెబ్బేరు రూరల్: మండలంలోని పెంచికలపాడుకు చెందిన నరసింహానాయుడు క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి మంగళవారం ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శించారు. ప్రభుత్వం ద్వారా అన్ని విధాలుగా సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

సాగులో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

వీపనగండ్ల: రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద మొక్కజొన్న పంట సాగుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించినట్లు ఏఓ డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. మొక్కజొన్న పంటను ఆశించే తెగుళ్ల, చీడపీడలు వ్యాప్తి చెందే వ్యాధిలోని రకాలు, వాటి నివారణపై పలువురు శాస్త్రవేత్తలు సూచనలు చేశారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 10వ వార్డులోని బుడగజంగాల కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు తీవ్రంగా దెబ్బతింది. రోడ్డు పూర్తిగా బురదమయంగా మారడంతో కాలనీ వాసులు నడిచేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కౌన్సిలర్ తిరుతపయ్యకు తెలిపారు. వెంటనే స్పందించిన కౌన్సిలర్ మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశానుసారం రోడ్డుపై రెండు టిప్పర్ల డస్ట్‌ను వేయించి డోజర్ సాయంతో చదును చేయించారు. సమస్య ఉందని చెప్పిన వెంటనే స్పందించిన కౌన్సిలర్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ జేసీబీ భాస్కర్, లాల్‌కోట రవి తదితరులు ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని ధర్నా



ధర్నా చేస్తున్న బొల్లారం, కొర్లకుంట గ్రామస్తులు

వీపనగండ్ల: గతంలో రద్దు చేసిన ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని, తీరుకు నిరసనగా మంగళవారం కొర్లకుంట చౌరస్తాలో పలు ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. బొల్లారం, కొర్లకుంట గ్రామాల మీదుగా గతంలో వనపర్తి, కొల్లాపూర్ పట్టణాలకు బస్సు నడిపేవారని, వీటిని రద్దు చేయడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు నాయకులు అన్నారు. రోడ్డుపై బైఠాయించడంతో ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాలు పూర్తిగా నిలిచిపోయాయి. స్పందించిన కొల్లాపూర్ డిపో అధికారి ధర్నా వద్దకు వచ్చి పది రోజుల్లో బస్సు వసతి కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ, బీవైఎస్‌ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు మూగ మహిళ



కుటుంబ సభ్యులతో బాధితురాలు

పాన్‌గల్: రెండు నెలల పాటు జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రంలో ఉంటున్న మూగ మహిళ సునీతను మంగళవారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. రెండు నెలల క్రితం పాన్‌గల్ మండలం అన్నారం సమీపంలో తప్పిపోయి తిరుగుతున్న పుట్టు మూగ, చెవిటి మహిళ సునీతను పాన్‌గల్ పోలీసులు సఖీ కేంద్రానికి అప్పగించారు. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం ప్రయత్నించినా చిరునామా లభించలేదు. ఇటీవల ఆమె ఫొటోను సోషల్ మీడియా, పలు వాట్సప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు మండలం గురుమూర్తిపల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించడంతో చికిత్స అనంతరం సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ కవిత సహకారంతో కానిస్టేబుల్ రామకృష్ణ కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. తప్పిపోయిన మహిళ తమ ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

భూ తగాదాలో ముగ్గురిపై కేసు నమోదు

కొత్తకోట రూరల్: భూ తగాదాల కారణంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురిపై కేసు నమోదయ్యింది. కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కనిమెట్టకు చెందిన పేరి రాజవర్ధన్‌రెడ్డికి గ్రామ శివారులో సర్వే నంబర్ 126, 127లో 2.03ఎకరాల భూమి ఉంది. మంగళవారం కరిగెట చేసేందుకు ట్రాక్టర్‌ను తీసుకెళ్తుండగా.. పక్క పొలానికి చెందిన ముగ్గురు ట్రాక్టర్‌ను అడ్డుకొని దాడికి యత్నించడంతో పాటు తన తల్లిదండ్రులను దురుసుగా మాట్లాడారని ఫిర్యాదు చేశాడు. పేరి రాజవర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్‌కు నివాళి

వనపర్తిటౌన్: ప్రార్థించే పెదవుల కన్నా.. సహాయం చేసే చేతులు మిన్నా అనే మాటకు నిలువెత్తు నిదర్శనం ఆస్పత్రుల్లో పనిచేసే నర్సులు అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అని అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఫ్లోరెన్స్ నైటింగేల్ 114వ వర్ధంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైద్యరంగంలో కీలకమైన నర్సు వృత్తికి గౌరవాన్ని తీసుకొచ్చిన మహనీయురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ అని కొనియాడారు. కార్యక్రమంలో గిరి రాజాచారి, బాలస్వామినాయుడు, బాలేమియా, నరసింహ, పరమేశ్వర చారి, సత్యం చారి, మాధవ చారి, రఘునాథ్‌రెడ్డి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చోరీకి పాల్పడిన ముగ్గురి అరెస్ట్

పెబ్బేరు రూరల్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను గస్తీ (బీట్) నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్నారని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల వ్యవసాయ మార్కెట్ షాపుల ఎదుట ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండగా గస్తీ నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాములునాయక్, కానిస్టేబుల్ రవికుమార్, హోంగార్డు కరుణాకర్‌గౌడ్, డ్రైవర్ మహేష్ అతడిని విచారిస్తుండగా పారిపోయాడు. అనుమానంతో 21 నంబర్ షాపు దగ్గరకు వెళ్లి చూడగా షాపు షెటర్ కొద్దిగా తెరుచుకోవడం గమనించి లోపలికి వెళ్లి చూడగా ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా.. షాపులో చోరీలు చేయడానికి వచ్చామని తెలిపారు. వారు చోరీ చే యడానికి ఉపయోగించిన రాడ్‌ను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. షాపు యజ మా ని నాగరాజుగౌడ్ రూ.800 నగదు పోయిందని మంగళవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

క్రైస్తవులు, మైనార్టీల రక్షణకు పోరాటం



కొత్తకోట రూరల్: క్రైస్తవ సామాజిక పరిరక్షణ వేదిక (కేఎస్‌పీవీ) 6వ ఆవిర్భావ వేడుకలను పట్టణ కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కుల వివక్షత పోరాట సమితి సభ్యులతో కలిసి రాష్ట్ర అధ్యక్షుడు షిమియాసోన్ కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా క్రిస్టియన్, మైనార్టీల రక్షణ కోసం కేఎస్‌పీవీ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. క్రిస్టియన్ల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంద వెంకటేష్, పాస్టర్లు సుందర్, ప్రభుదాస్, సంజీవయ్య, నవీన్‌కుమార్, సుజ్ఞానం, చంద్రబాబు, పాల్, శాంతిప్రసాద్, సోలమాన్, రవి, నిఖిల్, చిన్ను, రవికుమార్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆత్మకూర్: మండలానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం తన నివాసంలో అందజేశారు. మండలంలోని మోట్లంపల్లికి చెందిన శారదకు చెక్కును అందించారు. వివిధ అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల్లో చేరి చికిత్స చేయించుకున్న బాధితులకు రాష్ట్రప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రకమంలో జెడ్పీటీసీ మాజీసభ్యుడు బాలకిష్టన్న, మండల అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీనివాసులు, నాయకులు మచ్చేందర్‌గౌడ్, నాగన్న తదితరులు ఉన్నారు.

ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వాలి



వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆత్మకూర్: విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ అందక చదువుకు దూరమవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి రూ.8 వేల కోట్లు విద్యార్థులకు చెల్లించాల్సి ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల మంది విద్యార్థులు రియంబర్స్‌మెంట్ అందక విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం వెంటనే ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో నరేందర్, అరవింద్, మధు, చరణ్, కిరణ్, గణేష్, నవీన్ తదితరులు ఉన్నారు.

స్వేచ్ఛను హరించేందుకు కుట్ర



నల్ల చట్టాల ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: ఏఐవైఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మూడు నల్ల చట్టాల పత్రులను తగలబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిజ్జ శ్రీనివాసులు మాట్లాడుతూ.. దేశంలో మూడు నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం తేవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది అత్యంత దుర్మార్గమైన, ప్రజా వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. బలహీన వర్గాల ప్రజలను అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టడం, మీడియా స్వేచ్ఛను హరించడం, నిరసన తెలిపే హక్కులను హరిస్తూ నల్ల చట్టాలను తెచ్చిందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా తెచ్చిన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్, ప్రధాన కార్యదర్శి కుతుబ్, రమేష్, వంశీ, జానీ, వాజిద్ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరిస్తాం



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా అధికారి సుబ్బారెడ్డి

వీపనగండ్ల: సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో ర్కర్లు సమన్వయంతో పని చేయడం లేదని, గతంలో డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లిన వార్డెన్ మనోహర్ తిరిగి ఈ హాస్టల్‌లో బాధ్యతలు తీసుకొని ఉన్నత చదువుల కోసం దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. కలెక్టర్ అనుమతి లేకుండా హాస్టల్ విద్యార్థులను వదిలి వెళ్లడం సరికాదని, ఫోన్‌లో వార్డెన్ మనోహర్‌ను ఆయన మందలించారు. కొద్దిమంది విద్యార్థులే ఉన్నా ఇద్దరు వర్కర్లు ఉన్నారన్నారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కావలి మహేష్, గోపి, శివ హాస్టల్‌లో రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలని, విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలని జిల్లా అధికారికి వినతిపత్రం అందజేశారు.

‘తిండి పెట్టండి.. పని చెప్పండి’

వనపర్తి టౌన్: తిండి పెట్టండి.. పని చెప్పండంటూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్లు అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ... ఆగస్టు సగం నెల అయిపోతున్నా జులైకి సంబంధించిన వేతనాలు కార్మికులకు అందజేయకపోతే కుటుంబ పోషణ ఎలా అని ప్రశ్నించారు. అనంతరం కార్మికులు తిండి పెట్టండి.. పని చెప్పండి అని నినాదాలు చేశారు. పంద్రాగస్టు రోజు సబ్బులు, నూనె, బట్టలు, చెప్పులు, పనిముట్లు, బూట్లు, చేతులకు గ్లౌజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, ఉపాధ్యక్షుడు యాదగిరి, పట్టణ గౌరవాధ్యక్షుడు కురుమయ్య, పట్టణ అధ్యక్షుడు మౌలాలు, ప్రధాన కార్యదర్శి గోపాల్, నాయకులు, కార్మికులు మన్యం, సుమన్, బాలస్వామి, భగవంతు, రవి, బాలు, శేఖర్, జయమ్మ, చిట్టెమ్మ, సుశీలమ్మ, జయలక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

నగదు బహుమతులు



నగదు బహుమతి అందజేస్తున్న అన్నె నారాయణ

పాన్‌గల్: ప్రతి పేద విద్యార్థి ఉత్తమంగా చదువుకొని ఉన్నత శిఖరాలు చేరుకునేలా ప్రోత్సహించేందుకు ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం నగదు బహుమతులు అందజేస్తున్నట్లు మాజీ ఎంపీపీ అన్నెనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కళాశాల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ఆయన నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ సంవత్సరంలో నలుగురు విద్యార్థులలో ఒక్కొక్కరికి రూ. 1000, ద్వితీయ సంవత్సరంలో నలుగురు విద్యార్థులల్లో ఒక్కొక్కరికి రూ.1,500 చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

శాంతిభద్రతల రక్షణకు కృషి చేయాలి



పాన్‌గల్‌లో ఎస్‌ఐని సన్మానిస్తున్న నాయకులు

పాన్‌గల్: నూతన ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌యాదవ్‌ను మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు సహకారం ఉంటుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాముయాదవ్, బ్రహ్మయ్య, లక్ష్మయ్య, మాజీ సర్పంచ్‌లు బాలస్వామి, వెంకటయ్యయాదవ్, నాగేష్‌నాయక్, సహదేవ్‌నాయక్, హన్మంతు, నిరంజన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మదనాపురంలో..

మార్కెట్ యార్డ్ చైర్మన్‌కు..

మదనాపురం: స్థానిక మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన పల్లెపాగ ప్రశాంత్‌ను ఆయన కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు అంజాద్‌అలీతో పాటు కొత్తకోట మండల నాయకులు వేర్వేరుగా పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పద్మ అయ్యన్న, ఖాజా మైనోద్దీన్, బాదం వెంకటేశ్వర్లు, తోళ్ల నరేందర్‌నాయుడు, శ్రీధర్, రావుఫ్, నాకొండయాదవ్ తదితరులు పాల్గొన్నారు.